క్లుప్తంగా

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీల ప్రజావేదిక

ఉప్పునుంతల: మండలంలో వారం రోజులుగా ఈజీఎస్ పనులపై నిర్వహించిన 12వ విడత సామాజిక తనిఖీలకు సంబంధించిన మండల స్థాయి ప్రజావేదిక సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, సామాజిక తనిఖీల రిసోర్స్‌పర్సన్ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2020 జనవరి 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలో దాదాపుగా రూ.10.50 కోట్లతో చేపట్టిన ఈజీఎస్ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారులు, అందరి సమక్షంలో ప్రజావేదికలో వెల్లడిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత కూలీలు ప్రజావేదికలో పాల్గొనాలని కోరారు.

సత్యసాయి అన్నప్రసాదం పంపిణీ

బిజినేపల్లి: సత్యసాయి సేవా సమితి నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భగవాన్‌శ్రీ సత్యసాయిబాబా 12వ ఆరాధన దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 12 గంటలకు అన్న ప్రసాదం పంపిణీ ఉంటుందని ఆ సమితి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సత్యసాయిబాబా దేవాలయంలో తెల్లవారుజామున ప్రత్యేక సామూహిక అభిషేకాలు, అర్చనలు, 11 గంటలకు సత్యసాయిబాబా వారి ప్రత్యేక ఆరాధన భజనలు, మహా మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించే సత్యసాయి అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు. సాయంత్రం 6 గంటలకు సామూహిక భజన నిర్వహించనున్నట్లు చెప్పారు.

మండల సర్వసభ్య సమావేశం

లింగాల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లింగమ్మ, ఎంపీడీఓ గీతాంజలి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

26న ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26న బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి విధిగా హాజరుకావాలని సూచించారు.

లయన్స్ క్లబ్‌కు మైల్‌స్టోన్ అవార్డు



కల్వకుర్తి రూరల్: సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్లబ్ సభ్యుల సంఖ్య పెంచడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన కల్వకుర్తి లయన్స్ క్లబ్‌కు మైల్‌స్టోన్ అవార్డు లభించింది. ఆదివారం శంషాబాద్‌లో లయన్స్‌క్లబ్ మల్టిపుల్ 320 సమావేశం నిర్వహించారు. సమావేశానికి 10 జిల్లాల పరిధిలోని క్లబ్ సభ్యులు హాజరయ్యారు. క్లబ్ ఏర్పాటు చేసిన మొదటి సంవత్సరంలోనే మల్టిపుల్ స్థాయిలో అవార్డు రావడం ఆనందంగా ఉందని క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేశ్ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ సునిల్ కుమార్, విద్యాసాగర్ రెడ్డి, దీపక్ చటర్జీ, లయన్ జూలూరి రఘు చేతుల మీదుగా క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటేష్ అవార్డు అందుకున్నారు.

పంచాయతీ కార్మికులకు పరిహారం చెల్లించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: గ్రామపంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, ప్రమాదాల్లో చాలా మంది కార్మికులు చనిపోతున్నారని, వారికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శనివారం ఖమ్మం జిల్లాలో వెంకటేష్ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడని, మల్టిపర్పస్ విధానంతో పంచాయతీ కార్మికులు తీవ్ర పని ఒత్తిడికి లోనే అవుతున్నారని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాలు, రామయ్య, అశోక్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో రెవెన్యూ డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, ఊర్కొండ, వంగూరు మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆదివారం క్లాస్‌మేట్ క్లబ్, రాగా సంయుక్త ఆధ్వర్యంలో క్రికెట్, షటిల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి లక్ష్మీనరసింహారావు మాట్లాడారు. ఉపాధ్యాయుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. రాఘవేందర్, చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి, రాజేందర్, సైదులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



కొల్లాపూర్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గానూ 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించారు. 416 మంది విద్యార్థులకు 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు అన్ని వసతులు కల్పించామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రాములు తెలిపారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ఆదివారం ఐదో తరగతిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 242 మంది విద్యార్థులకు గాను 222 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలను పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న పర్యవేక్షించారు.

వెల్దండ: మండల కేంద్రంలోని గురుకుల రెసిడెన్షియల్‌లో 5వ తరగతి ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన 264 మంది విద్యార్థులకు 248 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులను పూర్తి స్థాయిలో చెక్ చేసి పరీక్ష కేంద్రాలకు పంపించారు. ప్రిన్సిపాల్ షకిలాసుల్తానా, వైస్‌ప్రిన్స్‌పాల్ కవిత, పరీక్ష సిబ్బంది స్వప్న, రవిశంకర్‌శెట్టి తదితరులు ఉన్నారు.

మన్ననూర్: గ్రామంలోని పీటీజీ, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీటీజీ పాఠశాలలో 384 మంది విద్యార్థులకు గానూ 367 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 408 మంది విద్యార్థులకు గానూ 378 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 34 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తెలిపారు.

తెలకపల్లి: సీఎల్‌ఆర్ కళాశాలలో తాడూరు గురుకుల పాఠశాలలో 240 మందికి 222 మంది, తెలకపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 432 మందికి 409 మంది, మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో 240 మందికి 225 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాసినట్లు పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాల్స్ తెలియజేశారు.



వెల్దండలో విద్యార్థులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

సంతలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

లింగాల: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దని ఎస్ఐ శ్రీనివాస్ వ్యాపారులకు సూచించారు. సంతలో విచ్చలవిడిగా వ్యాపారులు అమ్మకాలు కొనసాగించడం, ద్విచక్రవాహనాలు, ఇతర ప్రైవేటు వాహనాలు క్రమపద్ధతిలో నిలుపకపోవడంతో బస్సుల రాకపోకలకు ఆటంకం కలుగుతుందని తెలుసుకున్న ఎస్ఐ సంతను పరిశీలించారు. ప్రధాన మార్గంపై విక్రయాలు జరుపరాదని, బస్టాండ్‌లో ద్విచక్రవాహనాలు, ఇతర వాటిని నిలిపితే చలాన్ రాస్తామన్నారు. గ్రామపంచాయతీ వారు వ్యాపారులకు ఒక నియమిత స్థలం చూపించాలని, సంత రోజు ప్రైవేటు వాహనాలు నిలుపుటకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరారు.

నిరుద్యోగ మార్చ్‌కు తరలిరావాలి



మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

బిజినేపల్లి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఈ నెల 25న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులు తరలిరావాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలె భరత్ చంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. కనీస ప్రమాణాలు పాటించకుండా లీకేజ్ పర్వానికి తెర తీసిన పాలకులు, జరిగిన తప్పును సరిదిద్దుకోకుండా సాక్షాత్తు మంత్రులే ఇదంతా సర్వసాధారణం అనేలా వ్యవహరిస్తుంటే ఇంకెన్ని రోజులు సహిస్తూ.. ఉందామని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయాలని, మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ యువ నాయకులు సంతోష్, సత్యనారాయణ, వెంకటేష్, విజయ భాస్కర్, చందూ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభను విజయవంతం చేయండి

వెల్దండ: ముదిరాజ్‌లు రాజకీయంగా రాణించాలని ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడు పుట్ట శేఖర్‌ముదిరాజ్, మండల అధ్యక్షుడు మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం వెల్దండలోని బ్రహ్మగిరి దేవాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 26న కల్వకుర్తి పట్టణంలో నిర్వహిస్తున్న ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, శాసన మండలి వైస్‌చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్‌ముదిరాజ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముదిరాజ్‌ల హాజరవనున్నట్లు తెలియజేశారు. ముదిరాజ్ కులస్తుల హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర నాయకులు నూకం వెంకటయ్యముదిరాజ్, శ్రీకాంత్‌ముదిరాజ్, వెంకటయ్యముదిరాజ్, మల్లయ్య, కృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.

బసవేశ్వరుని బోధనలు ఆచరణీయం



అచ్చంపేటలో నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్



కల్వకుర్తిలో నివాళి అర్పిస్తున్న సభ్యులు

కల్వకుర్తి టౌన్: మహాత్మా బసవేశ్వర ఆశయాలు ఎప్పటికీ ఆచరణీయమని, కులరహిత సమాజ స్థాపనకు కృషిచేసిన వ్యక్తి బసవేశ్వరుడని మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ రాచోటి శ్రీశైలం అన్నారు. ఆదివారం బసవేశ్వరుని 890వ జయంతి సందర్భంగా పట్టణంలోని కైలాసం గుట్ట వద్ద ఉన్న బసవేశ్వరుని విగ్రహానికి వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దానం, ధర్మం, సమసమాజం కోసం పాటుపడిన సామాజికవేత్త బసవేశ్వరుడని, రాష్ట్ర ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహించటం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు చంద్రశేఖరప్ప, ఈశ్వరయ్య, శేఖరప్ప, శ్రీశైలం, విశ్వనాధం, రాజశేఖర్, శంకరప్ప, బస్వరాజు, మల్లప్ప, నందీశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా జయంతి

అచ్చంపేట: మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం మహాత్మా బసవేశ్వరా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, కౌన్సిలర్లు గౌరిశంకర్, మనుప్రసాద్, రమేష్‌రావు, అంతటి శివ, తగురం శ్రీనివాసులు, సుంకరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం

అచ్చంపేట: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం బీజేపీ నాయకులు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. చత్రునాయక్, రాహుల్‌రెడ్డి, అజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహనాయుడు ఆధ్వర్యంలో బీజేపీ ఎమ్మెల్యే ఈటల దిష్టిబొమ్మను దహనం చేశారు. డిష్‌రవి, గోపి, రవి నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: బల్మూర్‌లో ఈటల దిష్టిబొమ్మ దహనం చేశారు. శ్రీను, ఖదీర్, చంద్రమౌళి, అశోక్, సాయి, సురేష్ పాల్గొన్నారు.

కందనూలు: జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కూడలిలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హరీశ్‌గౌడ్, పవన్ పాల్గొన్నారు.

కొల్లాపూర్: స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, కాటమోని తిరుపతమ్మగౌడ్, రాముయాదవ్, కృష్ణయ్యగౌడ్, అన్వేష్‌గౌడ్, కాంతారావు, కురుమయ్య, శివానందం తదితరులు ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు రేణయ్య, శేఖర్‌గౌడ్, గోవింద్‌సింగ్, కృష్ణ, లింగారెడ్డి, భాస్కర్, వీరస్వామి తదితరులు ఈటల దిష్టి బొమ్మను దహనం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



నాగర్‌కర్నూల్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెండు బైక్‌లు ఢీ

తెలకపల్లి: మండల పరిధిలోని చిన్నముద్దునూరు గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెలకపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తున్న బైక్‌పై ఇద్దరు ఉండగా, నాగర్‌కర్నూల్ నుంచి తెలకపల్లికి వస్తున్న రవి, మల్లేష్ చిన్నముద్దునూరు గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రవి, మల్లేష్‌కు స్వల్ప గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలియజేశారు.

ఉపాధ్యాయుడికి గాయాలు

బల్మూర్: మండలంలోని కొండనాగుల సమీపంలోని అచ్చంపేట ప్రధాన రహదారిపై లింగాలకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కేతవత్ హతిరాం అచ్చంపేట వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. రోడ్డుకు అడ్డంగా అకస్మాతుగా కూలీలు రావడంతో వారిని తప్పించబోయి బోల్తా పడ్డారు. దీంతో తీవ్రగాయాలైన అతడిని చూసిన వాహనదారులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు స్నేహితులు తెలిపారు.

క్షతగాత్రుడికి చేయూత

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వెలమ పంక్షన్‌హాల్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనదారుడిని ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి 102 వాహనంలో చికిత్స నిమిత్తం తరలించాడు. ఆదివారం మధ్యాహ్నం వెలమ ఫంక్షన్ హాల్ మీదుగా వెళ్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి రోడ్డుపై గాయాలతో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడు కనిపించాడు. వెంటనే తన వాహనం నిలిపి చికిత్స నిమిత్తం బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

ఎంపీ రాములు పరామర్శ

బల్మూర్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని గట్టుతుమ్మెన్‌కి చెందిన మాజీ సర్పంచ్ ఆవంచ భూషన్న కుటుంబ సభ్యులను పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు ఆదివారం పరామర్శించారు.

సీఐకి సన్మానం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని టీచర్స్‌కాలనీలో మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుని వెళ్లిన దొంగను గంటల వ్యవధిలో చాకచక్యంగా పట్టుకున్న సీఐ అనుదీప్, ఎస్ఐ గోవర్ధన్, పోలీసు కానిస్టేబుల్ రాందాసును టీచర్స్ కాలనీ ప్రజలు ఘనంగా సన్మానించారు. అలాగే దొంగను వెంబడించి ఆధారాలు చెప్పిన ముగ్గురు చిన్నారులను అభినందించి ఒక్కొక్కరికి రూ.1,000 అందజేశారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. కాలనీవాసులు చంద్రమౌళి, బాల్‌రాజు, లక్ష్మి, కవిత పాల్గొన్నారు.

బీఎల్ పాండుకు..

పెద్దకొత్తపల్లి: సుప్రీంకోర్టు న్యాయవాది తెలంగాణ హైకోర్టులో ఎస్ఐ శాఖ ప్రభుత్వ ప్లీడర్ బీఎల్ పాండును పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాము శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. పేదరికంలో పుట్టిన బీఎల్ పాండు ఉన్నత చదువులు చదివి సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయవాదిగా ఎంతో పేరు సంపాదించుకున్నారని కొనియాడారు.

చలివేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సంస్థ అధ్యక్షుడు బాలకిష్టయ్య ప్రారంభించి మాట్లాడారు. 2012 నుంచి నేటి వరకు గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సంస్థ సభ్యులు భాస్కర్, రఘువేంద్ర గౌడ్, రమణయ్య, నసురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కల్వకుర్తి రూరల్: రైతు సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే రైతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. ఆదివారం మండలంలోని జిల్లెల్లలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీకాంత్‌రెడ్డి, రవి, శ్రీహరి, పాండు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు’



అచ్చంపేటలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పరిపాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మరోసారి తిరుగుండదని, ప్రతిపక్షాలకు జనాధారణ లేదని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్ హాలులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి ప్రభుత్వ విప్, జీబీఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గువ్వల అమల హాజరై మాట్లాడారు. దేశ ప్రజలు బీఆర్‌ఎస్ పాలనను ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన పథకాలపై ఇతర రాష్ట్రాల సీఎంలు ఆరా తీస్తూ ఆ రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అచ్చంపేటలో 100 పడకల ఆస్పత్రిని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకుని, అచ్చంపేట అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయించుకుందామన్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బొమ్మను తన ఛాతిపై పచ్చబొట్టు వేయించుకున్న ఓ అభిమానిని అభినందించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, తులసీరాం, శైలజ, అరుణ, లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాల్‌నారాయణగౌడ్ సేవలు మరువలేనివి

చారకొండ: మండల కేంద్రానికి చెందిన, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుండె బాల్‌నారాయణ గౌడ్ చారకొండలో నిరుపేదలకు, రైతులకు, ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్ అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన గుండె బాల్‌నారాయణ గౌడ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం వారి నివాసంలో వారి కుమారులు చారకొండ సర్పంచ్ విజేందర్ గౌడ్, కోడలు ఎంపీపీ నిర్మల ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మండలంలోని ముఖ్య నాయకులు హాజరై విగ్రహావిష్కరణ చేసి నివాళి అర్పించారు. సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, జూపల్లి వెంకటయ్య యాదవ్, లాలు యాదవ్, విజయ్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గీతా కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గీతా కార్మికులకు లైసెన్స్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

చారకొండ: రాష్ట్రంలో గీతాకార్మికుల అభివృద్ధి, వారి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండలం కేంద్రంలో గీతా కార్మికులకు మంజూరైన 175 గీతా కార్మిక లైసెన్స్‌లను మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా గీతా కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో కార్మికుల బకాయిలు రూ.లక్షల్లో ఉన్నాయని, మొండి బకాయిలుగా ఉండటంతో గీతా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గీతా కార్మికుల అభివృద్ధికి సీఎం మొండి బకాయిలను మాఫీ చేస్తూ.. ప్రతి గీతా కార్మికుడికి లైసెన్స్ అందించారన్నారు. దాంతో వారికి భద్రత, వయసు రిత్యా ఆసరాకు తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజేందర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గుర్వయ్య గౌడ్, జూపల్లి వెంకటయ్య యాదవ్, రవీందర్, నాయకులు, గీతా కార్మికులు ఉన్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



వెనచర్ల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు



వెల్దండలో గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

పెద్దకొత్తపల్లి: వెనచర్ల ఉన్నత పాఠశాలలో 1984–85వ సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించి అప్పటి ఉపాధ్యాయులైన వెంకటరంగయ్య, రాజవర్ధన్‌రెడ్డి, బి.సుదర్శన్‌రెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, జానకిరాంరెడ్డిలను విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో బీఎల్ పాండు, సురేందర్, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పూర్వ విద్యార్థులు 1965 నుంచి 2022 వరకు 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల దశలో ఉపాధ్యాయులతో తగరతి గదిలో ఉన్న అనుభవాలను వివరించారు. ఒకే పాఠశాలలో 57 ఏళ్ల కిందట చదువుతున్న విద్యార్థులు కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. వివిధ హోదాలో ఉన్న పూర్వ విద్యార్థులు గురువులకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ భూపతిరెడ్డి, నిరంజన్‌గౌడ్, బచ్చు రామకృష్ణ, చిందం కృష్ణయ్య, శ్రీనివాస్, రామాచారి పాల్గొన్నారు.

ఇంద్రకల్‌లో పాదయాత్ర

తాడూరు: పల్లెపల్లెన పవన్ జెండా ఎగరాలంటూ జనసేన నేత వంగ లక్ష్మణ్‌గౌడ్ చేపట్టిన పాదయాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని ఇంద్రకల్ చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మొదలు పెట్టిన జనసేన పార్టీ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటుందన్నారు. జనసేన నాయకులు భాస్కర్, మహేష్, రాకేష్, శివకుమార్, మహేష్‌గౌడ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

లింగాల: మండల పరిధిలోని పద్మన్నపల్లికి చెందిన రాయ గణేష్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య మృతుని కుటుంబానికి రూ.3 వేలు అందజేశారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

అమ్రాబాద్: మండలంలోని కల్ములోనిపల్లి మాజీ ఎంపీటీసీ కళమ్మ దంపతుల కుమారుడు చైతన్యకుమార్ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వలబాలరాజు వారి కుటుంబాన్ని సందర్శించి చైతన్య కుమార్‌కు నివాళి అర్పించారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

వెల్దండ: మండల పరిధిలోని కంటోనిపల్లికి చెందిన శ్యామలమ్మ కుటుంబాన్ని, బైరాపూర్‌కి చెందిన రాములు కుటుంబాలను ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న కొండనాగేష్

తాడూరు: తెలంగాణ ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరిస్తున్న కేటీఆర్‌ను బర్తరఫ్ చేసి 30 లక్షల మంది నిరుద్యోగులకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నేతలు కొండనాగేష్, లోహిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో నిరుదద్యోగుల మానప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ప్రతి పేపర్‌లో లీకేజిలు చేసి నిరుద్యోగ యువతకు ముందుకు సాగలేని విధంగా అడుగడుగున ఇబ్బందులకు గురిచేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారం జరిపించాలని డిమాండ్ చేశారు. మళ్లీ నిర్వహించే గ్రూపు 1 పరీక్షలో ఇటువంటివి పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. నీళ్ల, నిధులు, నియామకాల పేరుతో పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులు వీధిన పడ్డారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు వెంకటనారాయణ, శ్రీనివాసులు, సుల్తాన్, సాంబశివుడు పాల్గొన్నారు.